క్లుప్తంగా

అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ

ములకలచెరువు: మండలంలోని సోంపాళ్యం శ్రీకోట చౌడేశ్వరీదేవి అమ్మవారికి ములకలచెరువుకు చెందిన ముస్లిం దంపతులు సోమవారం బంగారు ఆభరణం బహూకరించారు. స్థానిక మండల కేంద్రం నల్లగుట్టకు చెందిన దంపతులు పి.రసూల్, పి. సంషాద్‌బీలు ఆలయ నిర్వాహకులకు రూ.60,500 విలవజేసే బంగారు హారం అందజేశారు.

టీటీడీకి కూరగాయల వితరణ

మదనపల్లె సిటీ: టీటీడీ నిత్యాన్నదానానికి మదనపల్లెకు చెందిన కూరగాయల వ్యాపారి దాదాపీర్, ఖాజాపీర్‌లు సోమవారం 12 టన్నుల కూరగాయలు ప్రత్యేక వాహనంలో పంపారు. వాహనాన్ని టు టౌన్ సీఐ మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రతి నెలా టీటీడీ నిత్యాన్నదానం కేంద్రంకు తనవంతుగా కూరగాయలు పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇమ్రోజ్‌పీర్, మస్తాన్, అయూబ్, రెడ్డిరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీటీఎం జాతరకు బస్సులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం శ్రీనలవీర గంగాభవానీ జాతరకు మంగళవారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుంచి మదనపల్లె –సీటీఎం మధ్యన 5 బస్సులు ప్రారంభిస్తామన్నారు. ఈ బస్సులు రేయింబవళ్లు నడుస్తాయన్నారు. 8న బుధవారం తిరునాలకు మరో 10 బస్సులు నడుపుతామన్నారు. వాల్మీకిపురం–సీటీఎం మధ్యన మరో 5 బస్సులు నడుపుతామన్నారు.

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలని వినతి

పీలేరు రూరల్ : పీలేరులో అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గిరీషాకు మాలమహానాడు నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. పీలేరుకు చెందిన పలువురు మాలమహానాడు నాయకులు స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి మల్లికార్జున, సుభాష్, జనార్దన్, ఆనంద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడికి సన్మానం

రామసముద్రం: మండలం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియామకమైన నరసాపురం గ్రామానికి చెందిన తిమ్మయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌గౌడు, ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్ నాయుడు, గెవన్నతోపాటు నాయకులు, ప్రజాప్రతినిధులు తిమ్మయ్యకు పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా తిమ్మయ్య మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, బీసీల అభ్యున్నతికి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: ఐదుగురు జూదరులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకటేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎస్‌‌ోపల్లె పంచాయతీ కనకంటివారిపల్లెకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ. 2650 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా జూదం, కోడిపందెం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల వేలంతో ఆదాయం

పెద్దతిప్పసముద్రం: మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తూ తనిఖీల్లో పట్టుబడిన వాహనాల్లో తొమ్మిది వాహనాలకు వేలం నిర్వహించామని ఎస్‌ఐ మధురామచంద్రుడు సోమవారం తెలిపారు. వేలంలో రూ.1,66,974ల ఆదాయం సమకూరినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాలవెల్లువపై వలంటీర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ అశ్విని

ములకలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అమూల్ డైయిరీ ద్వారా పాల సేకరణపై ఎంపీడీఓ అశ్విని సోమవారం మండలానికి చెందిన వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ... బీఎంసీయూ కేంద్రాల ద్వారా గ్రామాల్లో పాడిరైతుల నుంచి పాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారంచుట్టినట్లు చెప్పారు. ప్రతి పాడిరైతు అమూల్ డైయిరీకే పాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ రామమోహన్ సోమవారం తెలిపారు. రంగసముద్రంరోడ్డులో కృష్ణమూర్తి అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడిచేసి 20 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామని తెలిపారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత

- ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయండి
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి
- మండల సమావేశంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మండల సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గ వ్యాప్తంగా విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. సోమ వారం ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ప్రభుత్వశాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అధికారులు తదనుగుణంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన ఇళ్లన్నీ 2023 ఏడాది చివరికల్లా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మండలంలోని సీటీఎం, బొమ్మనచెరువు పీహెచ్‌సీలలో డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆస్పత్రులను బలోపేతం చేయాలన్నారు. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే వైద్యసేవలపై నమ్మకం పెరిగేలా పనిచేయాలన్నారు. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నా ప్రతిపక్షాలు చెడుగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. అధికారులు సంయమనంతో ఓపిగ్గా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ...ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో మండలంలో రూ.1.60కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుపులేటిరమణ, సింగిల్‌విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులు, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, సర్పంచ్‌లు దండుకరుణాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, ఈశ్వరయ్య, గణేష్, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు, సీడీపీఓ సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా రామసముద్రం

రామసముద్రం : మండల అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు న్యాయబద్ధంగా ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనల మేరకు మరిన్ని అభివృద్ధి పనులకు నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత శాఖల వారీగా అభివృద్ధి నివేదికలు చదివి వినిపించారు. సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి మాట్లాడుతూ..ఎరువులు, విత్తనాలను పలువురు డీలర్లు అధికధరలకు విక్రయించడమే కాకుండా యూరియా కావాలంటే డీఏపీ కొనాలని నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. దీనిపై ఏఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలలో అక్రమాలకు పాల్పడే వారిపై కేసులు నమోదుచేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల ఎంపిక విషయంలో ప్రజాప్రతినిధుల సూచనలు పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయన్నారు. పనుల ఎంపికపై కచ్చితంగా సలహాలు, సూచన పాటించాలని ఏపీఓ గౌరీశంకర్‌కు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, వైస్ఎంపీపీ రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, తహసీల్దార్ దైవరాజన్, ఎంపీడీఓ సురేష్, ఈవోపీఆర్డీ చలపతిరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నిమ్మనపల్లె : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తేవాలన్నారు. సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ రమణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పెద్దమండ్యం: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. ప్రజల సమస్యలను అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పక్కాగృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. మైక్రో వాటర్‌షెడ్ ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏఈ శంకర్‌రెడ్డి, ఏఈ హరిప్రసాద్, వెటర్నరీ డాక్టర్ ఉస్మాన్, ఏఓ సురేష్, ఏపీఓ మురళి పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో ఆరోగ్యసేవలు

- దీర్ఘకాలిక రోగులకు రూ.10వేలు పింఛన్
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



రెడ్డివారిపల్లెలో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: ప్రభుత్వం పేదలందరికీ ఆరోగ్యసేవలు అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెరువుమొరవపల్లె,రెడ్డివారిపల్లె, కురవపల్లె, మొరంపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో గడప గడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పలుసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. చెరువు మొరవపల్లెకు చెందిన లుకేమియా వ్యాధితో బాధపడుతున్న గీతాచరణ్, దిగువ హరిజనవాడకు చెందిన దీర్ఘకాలిక రోగి రాయచోటి లక్ష్మీపతి, రోడ్డుప్రమాదంలో గాయపడిన టి.అరుణలతో ప్రత్యేకంగా ఎమ్మెల్యే మాట్లాడాడు. వారికి అవసరమైన వైద్యసేవల కొసం అప్పటికప్పుడు తిరుపతి ఆస్పత్రులకు ఫోన్ చేసి సిఫార్సు చేశారు. వెంటనే వారికి రూ. 10 వేలు పింఛన్ అందించాలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలో ప్రతి ఒక్కరికి ఆరోగ్యసేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. అర్హులైన తమకు వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దళితవాడల్లో మురుగు నీటి కాలువలు నిర్మించాలని మహిళలు కోరారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామిని ఎమ్మెల్యే ఆదేశించారు.

భూ హక్కు పత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

భూహక్కు పత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమిలేపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా అమిలేపల్లె, మర్రిమాకులపల్లె, అరిగెలవారిపల్లె గ్రామాలకు చెందిన 926 మంది రైతులకు కొత్తగా మంజూరైన భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన భూహక్కు పత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటశివారెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీరమణ, మాజీ ఎంపీపీ జమీర్ ఆలీఖాన్, సింగిల్‌విండొ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ: నేపాల్ దేశం ఖాట్మండులో జరిగిన స్వైయ్ కరాటే సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–14 విభాగంలో రిహాన్‌బాషా గోల్డ్ మెడల్, అండర్–17లో హిరణ్మయి గోల్డ్‌మెడల్, అండర్–17లో మస్తాన్‌అలీ సిల్వర్‌మెడల్ సాధించినట్లు ఏపి స్వ్యాయ్ చైర్మన్ ఇస్మాయిల్, కోచ్ ఖాదర్‌బాషా సోమవారం తెలిపారు. వీరిని జిల్లా అధ్యక్షులు నరసింహులు అభినందించారు.

సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లుకు నూతనంగా 33/11 కేవీ సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైనట్లు డిస్కం ఏఈ ఉత్తన్న సోమవారం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డీఈ రాజశేఖర్‌రెడ్డి, ఏఈ రామలక్ష్మయ్య, స్థానిక సర్పంచ్ గిరీష్‌లు సబ్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమయ్యే స్థలాలను రెండు చోట్ల పరిశీలించినట్లు ఏఈ తెలిపారు.

బస్‌షెల్టర్ దురాక్రమణ యత్నంపై నిరసన

రామసముద్రం : బస్‌షెల్టర్ ఆక్రమించేందుకు నరసాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని నిరసిస్తూ సోమవారం రాగిమాకులపల్లె పంచాయతీ ప్రజలు రామసముద్రం–పుంగనూరు రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వీకులు నిర్మించిన షెల్టర్‌లో కొన్నేళ్లుగా రాగిమాకులపల్లె, కొత్తూరు, పేద్రాజుపల్లె, సొన్నేపల్లె గ్రామాల ప్రయాణికులు తలదాచుకునేవారని తెలిపారు. అయితే నరసాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి షెల్టర్ వెనుక తన స్థలం ఉండటంతో షెల్టర్ స్థలం తనదేనంటూ కూల్చేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, గంగిరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి సమస్యను పరిష్కరించడంతో ఆందోళన విరమించారు.

అసైన్డ్ భూములపై నివేదికలు తయారు చేయండి

మదనపల్లె : 22(ఏ) చుక్కల భూములను అసైన్డ్ చేయకుండా ఖాళీగా ఉండి ఆర్‌హెచ్ పేజీలో పట్టాదారు పేరు ఉంటే వాటికి సంబంధించి రెవెన్యూ అధికారులు నివేదికలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు గురువారంలోపు సమర్పించాలని ఆర్డీఓ మురళితెలిపారు. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో డివిజన్‌లోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో రెవెన్యూ విభాగానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్, రీసర్వే, ల్యాండ్ కన్వర్షన్, ఓటీఎస్ తదితరాలపై త్వరితగతిన పరిష్కారం దిశగా తహసీల్దార్‌లు చొరవచూపాలన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

కలకడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం, రుచికరంగా అందించాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద భోజనం తిని రుచిచూశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగన్న గోరుముద్దను ప్రతి విద్యార్థికి సకాలంలో అందించడంతో పాటు ఉపాధ్యాయుల పర్యవేక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మునీంద్ర నాయక్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టండి

నిమ్మనపల్లె : ప్రతిపక్ష నాయకులు, ఎల్లోమీడియా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చేస్తున్న అసత్యప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక సింగిల్‌విండో కార్యాలయం వద్ద గృహసారథులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఏ విధంగా పాటుపడుతుందో ఇంటింటికీ వెళ్లి వివరించడమే గృహసారథుల పని అని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ బాధ్యత వలంటీర్లు నిర్వహిస్తారని, పార్టీ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకే గృహసారథుల నియామకం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పదివేల ఇళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంటే ప్రస్తుతం 25వేల పక్కాగృహాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్యాక్ బృంద సభ్యులు సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 5.2లక్షల మంది గృహసారథుల నియామకం జరిగిందన్నారు. వలంటీర్లు గృహసారథులకు సహకరించాలన్నారు. నిమ్మనపల్లె మండలంలో 11 నుంచి గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

రామసముద్రం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రామసముద్రం మండలం అరికెల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు హెచ్‌ఎం గురునాథం సోమవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ –14 జిల్లా స్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఎస్.ఇందు అత్యంత ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఇందు పాల్గొననున్నట్లు చెప్పారు.

మహాలక్ష్మీ అవతారంలో జనార్దనస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మహాలక్ష్మి అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

పీలేరు : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎ.వి. సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బీజేవైం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్‌చంద్రబోష్ జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించనున్న మోదీ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరకోల్లాసం కలుగుతుందని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పులి నరేంద్రరెడ్డి, శ్రీనివాసయాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, వెంకటరమణ, మహదేవనాయుడు, రామాంజులు, అల్లాబక్షు, తాతయ్య, సుధారాణి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని దేవులపల్లె పాఠశాలలో వైద్యపరీక్షలు నిర్వహించి కుష్టు నివారణపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, 104 వైద్యసిబ్బంది శివకుమార్, రోజా, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ముజీబ్, హుస్సేన్ పాల్గొన్నారు.

భూములు కోల్పోయాం.. పరిహారం మంజూరు చేయండి



మాట్లాడుతున్న భూములు కోల్పోయిన రైతులు

పెద్దతిప్పసముద్రం: హంద్రీ నీవా కాలువల కోసం భూములు కోల్పోయిన మాకు ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం మంజూరు కాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కందుకూరు పంచాయతీకి చెందిన బాధిత రైతులు కే.వీరప్ప, కే.వెంకట్రమణ, కే.చెన్నప్ప, న్యామత్‌బీ, సాబ్‌జాన్ సోమవారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పీటీఎం హంద్రీ నీవా కాలువ నుంచి కందుకూరు వ్యాసరాయ చెరువు వరకు ఉప కాలువ పనులు చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఉప కాలువ పనుల కోసం అధికారులు రైతుల నుంచి భూములను సేకరించగా అందులో 1360/3 సర్వే నంబర్లలోని ఎనిమిది మందికి చెందిన 10.84 ఎకరాల భూములు కాలువ పనుల కోసం కోల్పోయామన్నారు. అప్పట్లో ఎకరాకు రూ.1.82 లక్షల పరిహారం మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా ఫలితం శూన్యం అన్నారు. అనంతరం టీడీపీ పాలనలో కాలువ పనులు చేపట్టిందన్నారు. పలువురికి పరిహారం మంజూరైనా మాలాంటి పేద రైతుల గోడు ఎవరూ పట్టించుకున్నా పాపానపోలేదని వాపోయారు. ఈ తరుణంలో సచివాలయాల తనిఖీలో భాగంగా గత ఏడాది డిసెంబర్ 13న కందుకూరుకు వచ్చిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు కూడా వినతి పత్రం అందజేశామన్నారు. అధికారులు స్పందించి త్వరగా పరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు కోరారు.